సాక్షి
ఆదిలాబాద్

సోమవారం । 18 । డిసెంబర్ । 2023



ఘనంగా పెన్షనర్స్ డే

ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. రిటైర్డు ఉద్యోగులు భారీగా హాజరయ్యారు. 8లో▸



వలస.. ఏదీ భరోసా? 8లో▸

ఉన్న ఊరిలో ఉపాధి అవకాశాలు తగ్గిపోతుండడంతో ఉమ్మడి జిల్లావాసులు వలసబాట పడుతున్నారు. నేడు అంతర్జాతీయ వలస దారుల దినోత్సవం నేపథ్యంలో కథనం.

గరిష్టం/కనిష్టం
26.0/12.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వేకువజామున, రాత్రి వేళలో చలితీవ్రత పెరగనుంది.

రథోత్సవం.. నేత్రపర్వం



భజన గీతాలు ఆలపిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్ తదితరులు



రథోత్సవానికి మహిళల మంగళహారతులు



రథోత్సవంలో భక్తుల సందడి

జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠ రథోత్సవం ఆదివారం నేత్రపర్వంగా సాగింది. తొలి మఠాధిపతి శ్రీపూర్ణానందం సరస్వతి మహరాజ్ జయంతి పురస్కరించుకుని ఏళ్లుగా జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా స్వామి వారి రథోత్సవాన్ని సాయంత్రం చేపట్టారు. మఠాధిపతి యోగానంద సరస్వతి మహరాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. పూర్ణానంద సరస్వతి మకుటంతో పాటు రుక్మిణి, సత్యభావ సహిత శ్రీగోపాలకృష్ణ స్వామి ఉత్సవ విగ్రహాలను రథంలో ఉంచి పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. మేళ తాళాలు, భజన సంకీర్తనలు, కోలాటాలు, మంగళహారతుల నడుమ రథయాత్ర కొనసాగింది. పట్టణంతో పాటు మహారాష్ట్ర నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. జాతర పురస్కరించుకుని ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. జాతర 15 రోజుల పాటు కొనసాగుతుందని మఠాధిపతి యోగానంద సరస్వతి మహరాజ్ తెలిపారు. ఇందులో సనాతన హిందూ ఉత్సవ సమితి నాయకులు ప్రమోద్‌కుమార్ ఖత్రి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

– ఎదులాపురం

గాడిన పడని పాలన!

- పథకాలపై అందని మార్గదర్శకాలు
- ప్రభుత్వశాఖల్లో కనిపించని హడావుడి
- ఉత్తర్వుల కోసం ఎదురుచూపు



కలెక్టర్ కార్యాలయం

కైలాస్‌నగర్: జిల్లాలో అధికార యంత్రాంగం ఇంకా ఎన్నికల మూడ్‌లో నుంచి బయటకు వచ్చినట్లుగా కనిపించడం లేదు. కొత్త సర్కారు కొలువుదీరి వారం గడుస్తున్నా క్షేత్రస్థాయిలో పాలనా వ్యవహారాలు ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదనే విమర్శలున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు సంబంధించి మార్గదర్శకాలు అందకపోవడం కారణంగా తెలుస్తోంది. పలు ప్రభుత్వ శాఖల్లో అధికారులు, ఉద్యోగులు స్తబ్దుగా కనిపిస్తున్నారు. కొన్ని కార్యాలయాల్లోనైతే అందుబాటులో ఉండని పరిస్థితి. శాఖాపరంగా జరగాల్సిన రెగ్యులర్ కార్యక్రమాలకే పరిమితం అవుతున్నారు.

పథకాలపై రాని స్పష్టత

బీఆర్‌ఎస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సొంత స్థలంలో ఇంటి నిర్మాణం కోసం రూ.3లక్షల ఆర్థికసాయాన్ని అందించేలా గృహలక్ష్మి, కుల వృత్తులపై ఆధారపడి జీవించే బీసీలను ఆదుకునేలా రూ.లక్ష సాయమందించే బీసీబంధు, మైనార్టీ బంధు స్కీంలను అమలు చేసింది. వాటి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించగా వేలాది మంది అప్లై చేసుకున్నారు. ప్రస్తుతం సర్కారు మారిపోవడంతో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్కీంలను కొనసాగిస్తుందా, లేక వాటికి ప్రత్యామ్నాయంగా కొత్త స్కీంలను ప్రవేశపెడుతుందా అనేదానిపై ఇంకా ఎలాంటి అధికారిక ఉత్తర్వులు అందలేదు. ఇదిలా ఉంటే కొన్ని చోట్ల పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపు కోసం లక్కీడ్రా నిర్వహించి లబ్ధిదారులను సైతం ఎంపిక చేశారు. వారికి ఇళ్లను కేటాయిస్తారా లేక తాజాగా మరోసారి లబ్ధిదారులను ఎంపిక చేస్తారా అనేదానిపై కూడా స్పష్టత కొరవడింది. మరికొన్ని చోట్ల ఇళ్ల నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు ప్రాధాన్యతనిస్తుండటంతో అసంపూర్తిగా మిగిలిన ఇళ్లను పూర్తిచేసి అర్హులకు కేటాయిస్తారా లేదా అనే దానిపై కూడా స్పష్టత రావాల్సి ఉంది. దీంతో పాటు అర్హులైన పేదలు ఏడేళ్లుగా రేషన్ కార్డుల కోసం నిరీక్షిస్తున్నారు. కొత్త కార్డులతో పాటు కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం ఇప్పటికే వేల సంఖ్యలో దరఖాస్తులు అందాయి. వారంతా సర్కారు ఉత్తర్వుల కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికిప్పుడు కొత్త కార్డులను జారీ చేస్తారా లేక పాత దరఖాస్తులకు పరిష్కారం చూపి మార్పులు, చేర్పులకు తొలుత అవకాశం కల్పిస్తారా అనేది సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

మార్గదర్శకాల కోసం ఎదురుచూపు

యువత, మహిళలు, రైతులు, కౌలు రైతులు, పేదలు, వృద్ధుల సంక్షేమమే లక్ష్యంగా ఆరు గ్యారంటీలే ప్రధాన ప్రచార అస్త్రాలుగా రంగంలోకి దిగిన కాంగ్రెస్ పార్టీ ప్రజల మద్దతుతో అధికారంలోకి వచ్చింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతులకు పెట్టుబడి సాయం వంటి రెండు అంశాలను ఇప్పటికే అమల్లోకి తెచ్చింది. వాటికి సంబంధించిన మార్గదర్శకాలు ప్రకటించడంతో అవి అమలవుతున్నాయి. పింఛన్లు, నిరుద్యోగ భృతి, ఇంటి స్థలాలు, రూ.5లక్షల ఆర్థికసాయం, రూ.500కే ఎల్‌పీజీ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పలు అంశాలు అమలు చేయాల్సి ఉంది. వాటి అమలుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు, మార్గదర్శకాలు అందలేదు. వీటితో పాటు ఆయా శాఖల్లో ప్రభుత్వ పరంగా జరగాల్సిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి స్పష్టమైన గైడ్‌లైన్స్ అందలేదు. అలాగే ఆయా శాఖల్లో అధికారిక కార్యక్రమాలేమి ఇంకా అమల్లోకి రాలేదు. ప్రభుత్వం అన్ని అంశాలపై శ్వేతపత్రం విడుదలకు కసరత్తు చేస్తుండటంతో మరికొన్ని రోజుల పాటు యంత్రాంగంలో ఇదే పరిస్థితి ఉండవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

నేడు ఆదిలాబాద్ ఎమ్మెల్యేతో ఫోన్ ఇన్



పాయల్ శంకర్, ఎమ్మెల్యే, ఆదిలాబాద్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో 'సాక్షి' ఆధ్వర్యంలో సోమవారం ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. నియోజకవర్గ పరిధిలోని సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకునేలా అవకాశం కల్పిస్తోంది.

దయల్ చేయాల్సిన నంబర్ :
98488 90171
సంప్రదించాల్సిన సమయం :
ఉదయం 9 నుంచి 10గంటల వరకు

సర్కారు బడులకు.. సౌర వెలుగులు

- జిల్లాలో 179 పాఠశాలలు ఎంపిక
- బడులకు తగ్గనున్న విద్యుత్ భారం
- పునరుత్పాదన ఇంధన వనరులు ప్రోత్సహించేలా ప్రభుత్వ నిర్ణయం



ఆదిలాబాద్ పట్టణంలోని ఎంపీయూపీఎస్ ఉర్దూ మీడియంలో సోలార్ ప్యానళ్లు

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడుల్లో సోలార్ సిస్టమ్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో 179 పాఠశాలలను ఎంపిక చేసింది. ప్రాథమిక పాఠశాలల్లో రెండు కిలోవాట్ల ఎలక్ట్రికల్ ప్యానళ్లను ఏర్పాటు చేయనుండగా, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 5 కిలోవాట్లు, కేజీబీవీలలో 10 కిలో వాట్లు గల గ్రిడ్ ప్యానళ్లను పంపిణీ చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి వనరుల సంస్థ ద్వారా ఈ ప్రక్రియ చేపడుతుంది. ఐదేళ్ల పాటు ఆ సంస్థ నిర్వహణ బాధ్యతలు చేపట్టనుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సర్కారు బడులకు మేలు జరగనుంది. విద్యుత్ బిల్లుల భారం తగ్గనుంది. కాగా గతేడాది జిల్లా వ్యాప్తంగా 40 పాఠశాలల్లో సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేశారు.

తడిసి మోపెడవుతున్న బిల్లులు..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్ బిల్లులు తడిసి మోపెడవుతున్నాయి. కొంత మంది ఉపాధ్యాయులు తమ జేబుల్లో నుంచి బిల్లులు చెల్లిస్తున్నారు. మరికొన్ని చోట్ల విద్యుత్ బిల్లులు భారీగా పేరుకుపోవడంతో కనెక్షన్లు కూడా తొలగించాల్సిన దుస్థితి. పాఠశాలల్లో ఫ్యాన్లు, బల్బులు, ట్యూబ్‌లైట్లతో పాటు కంప్యూటర్లు, నీటి కోసం బోర్లను వినియోగిస్తున్నారు. వీటితో బిల్లులు అధిక మొత్తంలో వస్తున్నాయి. అయితే స్కూల్ గ్రాంట్ అంతంత మాత్రంగానే విడుదలవుతోంది. అవికూడా సకాలంలో అందకపోవడంతో అప్పటివరకు ఈ బిల్లులు పేరుకుపోతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది.

జిల్లాలో ఇలా..

జిల్లాలో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు 644 ఉన్నాయి. వీటిలో 65వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే ప్రభుత్వం జిల్లాలో 179 పాఠశాలల్లో సోలార్ సిస్టమ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే మన ఊరు–మనబడి ద్వారా మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్న విషయం తెలిసిందే. సోలార్ సిస్టమ్ కేటాయించిన పాఠశాలల్లో 52 ప్రాథమిక, 28 ప్రాథమికోన్నత, 82 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అలాగే 17 కేజీబీవీలకు ఈ సౌకర్యం కల్పించనున్నారు. ఒక్కో కిలోవాట్ ప్యానల్‌కు సంబంధించి రూ.లక్ష వరకు ఖర్చు అవుతుండగా, ప్రాథమిక పాఠశాలలకు రూ.2లక్షల చొప్పున, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రూ.5లక్షల చొప్పున, కేజీబీవీలకు రూ.10 లక్షల చొప్పున నిధులతో సమకూర్చుతోంది. ఆదిలాబాద్‌రూరల్ మండలంలో 11, ఆదిలాబాద్‌అర్బన్‌లో 27, బజార్‌హత్నూర్‌లో 7, బేలలో 7, భీంపూర్‌లో 8, బోథ్‌లో 15, గాదిగూడలో 3, గుడిహత్నూర్‌లో 11, ఇచ్చోడలో 11, ఇంద్రవెల్లిలో 10, జైనథ్‌లో 18, మావలలో 2, నార్నూర్‌లో 6, నేరడిగొండలో 7, సిరికొండలో 3, తలమడుగులో 13, తాంసిలో 8, ఉట్నూర్ మండలంలో 12 పాఠశాలలకు సోలార్ ప్యానళ్లను కేటాయించనున్నారు.

179 పాఠశాలలు ఎంపిక

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్ బిల్లుల భారం తగ్గించడంతో పాటు పునరుత్పాదన ఇంధన వనరులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం జిల్లాలోని ఆయా పాఠశాలల్లో సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేస్తుంది. జిల్లా వ్యాప్తంగా 179 పాఠశాలలను ఎంపిక చేసింది. ఇదివరకే స్కూళ్లకు ఇవి చేరుకోగా త్వరలోనే అమర్చనున్నారు.

– జె.నారాయణ, జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి

పార్లమెంట్‌లోనూ గెలిపించండి

- బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్‌బన్సాల్
- నిర్మల్‌లో ఎన్నికల సన్నాహక సమావేశం
- 'అసెంబ్లీ'కి ఓటేసినందుకు కృతజ్ఞతలు
- ఉమ్మడి జిల్లా నాయకులు హాజరు



సమావేశంలో ఉమ్మడిజిల్లా నేతలతో చర్చిస్తున్న బన్సాల్

నిర్మల్: 'తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఎనిమిది మంది ఎమ్మెల్యేలను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీజేపీని అధిక సీట్లలో గెలిపించాలి' అని పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సాల్ కోరారు. నిర్మల్ జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి క్యాంప్‌ఆఫీస్‌లో ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, రానున్న పార్లమెంట్ ఎన్నికల సమాయత్తంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ బన్సాల్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆదిలాబాద్‌లో నాలుగు అసెంబ్లీ సీట్లు గెలుచుకోవడం హర్షణీయమని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లోనూ పార్టీని గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులంతా ప్రజల్లోకి వెళ్లాలని, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ సంస్థాగత విధానాలపై చర్చించారు. ఉమ్మడి జిల్లా బాధ్యులతో వేర్వేరుగా అభిప్రాయాలు సేకరించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్, పాయల్‌శంకర్, హరీశ్‌బాబు, ఆసిఫాబాద్ అభ్యర్థిగా పోటీచేసిన ఆత్మారాంనాయక్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి అయ్యన్నగారి భూమయ్య, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్, జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శులు మెడిసెమ్మె రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, నాలుగు జిల్లాల అధ్యక్షులు, ఇన్‌చార్జీలు, ప్రభారీలు, అసెంబ్లీ కన్వీనర్లు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

20న క్రాస్ కంట్రీ పరుగు ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో క్రాస్ కంట్రీ పరుగు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డి బోజారెడ్డి, రాజేశ్ ప్రకటనలో తెలిపారు. అండర్–16,18, 20, పురుషులు, మహిళల విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పాల్గొనే క్రీడాకారులు రూ.50 ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. సంబంధిత వయస్సు ధ్రువీకరణ పత్రం, బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఎస్సెస్సీ మెమోతో ఉదయం 8 గంటలకు స్టేడియంలో రిపోర్టు చేయాలని సూచించారు. వివరాలకు 9492136510 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సునీల్ చవాన్

ఎదులాపురం: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా అధ్యక్షుడు సునీల్ చవాన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జిల్లాకార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లుగా విద్యారంగంతో పాటు ఉపాధ్యాయులు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యారన్నారు. కొత్తగాకొలువుదీరిన ప్రభుత్వం అన్ని సమస్యలను పరిష్కరించాలన్నారు. ఇందులో జిల్లాప్రధానకార్యదర్శి గోపీకృష్ణ, నాయకులు నారాయణ, మనోజ్‌రెడ్డి, గంగాధర్, గోమంత్‌రెడ్డి, దేవ్‌రావు, జీజాబాయి, మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతర పోరాటం'

ఎదులాపురం: ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతరం పోరాడుతున్నట్లు ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం, ప్రతిపక్షం సహకరించాలని కోరారు. ఇందులో జిల్లా కార్యవర్గ సభ్యులు రాములు, దేవిదాస్, భాస్కర్, పట్టణ కార్యదర్శి అరుణ్ కుమార్, సీనియర్ నాయకులు నర్సింగ్‌రావు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- మౌలిక వసతుల కల్పనకు కృషి
- సాక్షి 'ఫోన్‌ఇన్'లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇచ్చోడ: 'బోథ్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తా.. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల సౌకర్యం, మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తా.. నాపై నమ్మకం ఉంచి గెలిపించిన నియోజకవర్గ వాసులకు జీవితాంతం రుణపడి ఉంటా.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తా..' అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఎమ్మెల్యేతో ఆదివారం 'సాక్షి ఫోన్‌ఇన్' నిర్వహించగా ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సుమారు వందకు పైగా కాల్స్ రాగా ఎమ్మెల్యే ఓపిగ్గా విని సమాధానాలిచ్చారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి భరోసా కల్పించారు. ఆయా మండలాల నుంచి అందిన వాటిలో కొన్ని..

ప్రశ్న: సిరికొండలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి? (దత్తు, సిరికొండ)

ఎమ్మెల్యే: అధికారులతో మాట్లాడి కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తా.

ప్రశ్న: బజార్‌హత్నూర్ మోడల్ స్కూల్‌కు వెళ్లే రోడ్డును నిర్మించాలి. అలాగే కుచులాపూర్ నుంచి గిరిగాం వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి? (గజానంద్, గిరిగాం, తలమడుగు) (చిక్కాల జనార్దన్, జాంసింగ్, బజార్‌హత్నూర్)

ఎమ్మెల్యే: అధికారులతో మాట్లాడి త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించేలా చూస్తాను.

ప్రశ్న: ఇచ్చోడలో నిర్మల్ బైపాస్ నుంచి ఆదిలాబాద్ బైపాస్ వరకు ఉన్న రోడ్డు నిర్మాణ పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు? (విజయ్‌కుమార్, సిరిసిల్ల భూమయ్య, ఇచ్చోడ)

ఎమ్మెల్యే: రోడ్డు నిర్మాణ పనుల కోసం రూ.13 కోట్లు మంజూరయ్యాయి. సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి రెండు, మూడు రోజుల్లో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటా.

ప్రశ్న: గోముత్రి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టే విధంగా కృషి చేయాలి..? (దేవారెడ్డి, కరంజి (టి), భీంపూర్)

ఎమ్మెల్యే: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో గోముత్రి ప్రాజెక్టు నిర్మాణం కోసం డీపీఆర్ ఇచ్చారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంతో మాట్లాడి ప్రాజెక్టు నిర్మాణం కోసం నా వంతు కృషి చేస్తా.

ప్రశ్న: గిరిజనేతరులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలి? (దేవిదాస్, జామిడి, ఇచ్చోడ) (లక్ష్మి, గురుజ, గుడిహత్నూర్)

ఎమ్మెల్యే: గిరిజనేతరుల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించి, వారు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇప్పించేలా కృషి చేస్తా.

ప్రశ్న: మత్తడి వాగు ప్రాజెక్టు నుంచి వడ్డాడికి వెళ్లే దారిలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి..(ఖుర్షీద్, వడ్డాడి, తాంసి)

ఎమ్మెల్యే: వడ్డాడి వద్ద బ్రిడ్జి నిర్మాణానికి ప్రత్యేక నిధులు మంజూరు చేసి పనులు చేపట్టేలా కృషి చేస్తా.

ప్రశ్న: కప్పర్ల రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసే విధంగా కృషి చేయాలి..(సంతోష్, ఎంపీటీసీ, కప్పర్ల, తాంసి)

ఎమ్మెల్యే: కప్పర్ల రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరై ఉన్నాయి. మధ్యలో పనులు నిలిచిపోయాయి. అధికారులతో మాట్లాడి ప్రారంభించేలా కృషి చేస్తా.

ప్రశ్న: ఒంటరి మహిళ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా.. ఇంత వరకు రాలేదు?(వరుణ, సిరిచెల్మ, ఇచ్చోడ)

ఎమ్మెల్యే: పింఛన్ ఎందుకు రావడం లేదో అధికారులతో మాట్లాడి వచ్చే నెల నుంచి వచ్చేలా కృషి చేస్తా.

ప్రశ్న: జెండగూడకు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయండి?(దేవిదాస్, కమట్వాడ, తాంసి)

ఎమ్మెల్యే: విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి జెండగూడకు త్వరలో విద్యుత్ సౌకర్యం కల్పించే విధంగా కృషి చేస్తా.

ప్రశ్న: నేరడిగొండలో జాతీయ రహదారి మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయండి? (సాబ్లే సంతోష్‌సింగ్, నేరడిగొండ)

ఎమ్మెల్యే: రెండు రోజుల క్రితమే నేషనల్ హైవే అథారిటీ అధికారులతో మాట్లాడటం జరిగింది. త్వరలోనే ఏర్పాటయ్యే విధంగా చూస్తా.

ప్రశ్న: బోథ్‌లో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి?(షేక్ షాకిర్, బోథ్)

ఎమ్మెల్యే: బోథ్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా హామీ ఇచ్చింది. ప్రభుత్వంతో చర్చించి డివిజన్ ఏర్పాటు జరిగేలా చూస్తా.

ప్రశ్న: ఫ్లోరైడ్ సమస్యకు పరిష్కారం చూపండి? (విద్యాసాగర్, గులాబ్‌తండా, సర్పంచ్, బజార్‌హత్నూర్)

ఎమ్మెల్యే: గులాబ్‌తండాలో ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తా. గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు నా వంతు ప్రయత్నం చేస్తా.

ప్రశ్న: నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిల్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోండి? (సందీప్, బోరిగామ, నేరడిగొండ)

ఎమ్మెల్యే: నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిల్ సెంటర్ ఏర్పాటు కోసం నా వంతు కృషి చేస్తా. నిరుద్యోగ యువతను ఆదుకునే విధంగా చర్యలు తీసుకుంటా.

ప్రశ్న: మహర్ కులస్తులకు తహసీల్దార్ కార్యాలయంలో కుల ధ్రువీకరణ పత్రాలు ఇప్పించే విధంగా కృషి చేయండి? (బుద్దే కిషన్, గుడిహత్నూర్)

ఎమ్మెల్యే: కలెక్టర్‌తో మాట్లాడి మహర్, మాంగ్ కులస్తులకు తహసీల్దార్ కార్యాలయంలోనే కుల ధ్రువీకరణ పత్రం ఇప్పించేలా ప్రయత్నిస్తా.

ప్రశ్న: భూములు లేని గిరిజనులకు ప్రభుత్వం ద్వారా భూములు ఇప్పించండి?(ఉమేశ్ వైద్య, తాంసి (కె))

ఎమ్మెల్యే: ఈ విషయంపై అసెంబ్లీలో ప్రస్తావిస్తా. నియోజకవర్గంలో భూములు లేని గిరిజనులకు భూములు ఇప్పించేలా కార్యాచరణ చేపడతా.

ప్రశ్న: మోర్కండి నుంచి బరంపూర్ మీదుగా ఆదిలాబాద్ వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టండి? (నరేశ్, దేగామ, బజార్‌హత్నూర్)

ఎమ్మెల్యే: అటవీశాఖ అనుమతులు లేనందున రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. అనుమతులు తీసుకుని పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటా.

ప్రశ్న: బస్సు సౌకర్యం కల్పించండి?(మహేశ్, సొనాల, బోథ్)

ఎమ్మెల్యే: ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు రాని గ్రామాలకు ఆర్టీసీ సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తా.

ప్రశ్న: చిక్మాన్ ప్రాజెక్టు ఎత్తు పెంచేలా చర్యలు తీసుకోవాలి? (ఆవుల రవి, సిరికొండ)

ఎమ్మెల్యే: చిక్మాన్ ప్రాజెక్టు ఎత్తు పెంచే విషయం ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది. నీటి పారుదల శాఖ మంత్రితో చర్చించి ప్రాజెక్టు ఎత్తు పెంచే దిశగా చర్యలు తీసుకుంటా.

ప్రశ్న: తెలంగ్‌రావు గూడకు రోడ్డు సౌకర్యం కల్పించండి?(రాయిసిడా జంగుపటేల్, తెలంగ్‌రావుగూడ, గుడిహత్నూర్)

ఎమ్మెల్యే: తెలంగ్‌రావుగూడ రోడ్డు నిర్మాణం కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేసి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: నెటవర్క్ సమస్యను పరిష్కరించండి? (నైతం కృష్ణ, పల్సి (బి), తలమడుగు)

ఎమ్మెల్యే: టెలికాం అధికారులతో చర్చించి పల్సి(బి)లో నెట్‌వర్క్ సమస్యను అధిగమించే విధంగా కృషి చేస్తా.

ప్రశ్న: అడెగామ (కె) చెరువు కాల్వ నిర్మాణం పనులు చేపట్టాలి?(కాటిపెల్లి చంద్రశేఖర్‌రెడ్డి, ఇచ్చోడ)

ఎమ్మెల్యే: నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడి అడెగామ (కె) చెరువు కింద పెండింగ్‌లో ఉన్న కాల్వ నిర్మాణ పనులు ప్రారంభించేలా కృషి చేస్తా.

ప్రశ్న: డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయించండి..? (సురేశ్, గుగ్గిల్ల స్వామి, సూర్యశేఖర్, సిరికొండ/సుదర్శన్ మోర్కండి, బజార్‌హత్నూర్/రబ్‌డే రవి, చందు నాయక్‌తండా, బజార్‌హత్నూర్/లక్ష్మణ్, రుయ్యాడి, తలమడుగు)

ఎమ్మెల్యే: ప్రభుత్వ విధి విధానాలు రూపొందించిన తర్వాత అర్హులైన వారందరికీ ఇండ్లు మంజూరయ్యే విధంగా కృషి చేస్తా.

క్లుప్తంగా

లైబ్రేరియన్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎదులాపురం: జిల్లాకేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఖాళీగా ఉన్న రెండు తాత్కాలిక లైబ్రేరియన్ పోస్టులకు మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకులాల ప్రాంతీయ సమన్వయకర్త కొప్పుల స్వరూపరాణి ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు బీఎల్ఐఎస్సీ రెగ్యులర్ విధానంలో చదివి ఉండాలని పేర్కొన్నారు. ఎంఎల్ఐఎస్సీ చదివిన వారికి ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. అర్హత ఉన్నవారు ఈనెల 21న ఉదయం 10 గంటల వరకు కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. అదే రోజు జరిగే ఇంటర్వ్యూలకు ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

ఎన్పీడీసీఎల్ సీఎండీని కలిసిన విద్యుత్ ఉద్యోగులు



వరుణ్‌రెడ్డికి పూలమొక్క ఇస్తున్న ఉద్యోగులు

ఉట్నూర్‌రూరల్: ఎన్పీడీసీఎల్ సీఎండీగా బాధ్యతలు చేపట్టిన వరుణ్‌రెడ్డి ఆదివారం ఉట్నూర్‌కు వచ్చారు. ఐటీడీఏ కార్యాలయంలో ఆయన్ను విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్, డీఈ సుభాష్ జాదవ్, ఏడీ చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఉట్నూర్, ఇంద్రవెల్లి ఏఈలు శ్రావణ్ రోహిదాస్‌తోపాటు జాదవ్ ప్రకాశ్, వినయ్‌రెడ్డి, బాలాజీ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, వరుణ్‌రెడ్డి ఉట్నూర్ ఐటీడీఏ పీవో, నిర్మల్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే.

బాధిత కుటుంబానికి పరామర్శ

భైంసా: మండలంలోని కామోల్‌లో శనివారం రాత్రి సిలిండర్ పేలి ద్రుపతిబాయి(49) మృతిచెందింది. గ్రామానికి చెందిన లింగన్న–ద్రుపతిబాయి దంపతులు రేకులషెడ్డు వేసుకుని నివసిస్తున్నారు. లింగన్న గ్రా మంలోని ఆలయంలో భజన కార్యక్రమానికి వెళ్లగా, ద్రుపతిబాయి ఇంట్లో నిద్రిస్తుంది. ఈ క్రమంలో సిలిండర్ పేలి మృతిచెందింది. ఎ మ్మెల్యే పవార్ రామారావుపటేల్ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్ర భుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం అందేలా చూస్తానన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భోస్లే మోహన్‌రావుపటేల్ బాధిత కుటుంబీకులను పరామర్శించి నిత్యావసరా లు, దుస్తులు, నగదు అందజేశారు. అలాగే ని వాసానికి షెడ్డుఏర్పాటు చేసిస్తానని హామీఇచ్చారు.

ఘనంగా పెన్షనర్స్ డే



మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

కైలాస్‌నగర్: పెన్షనర్స్ డేను ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని టీఎన్జీవోస్ భవనంలో పెన్షనర్స్ డే ఆత్మీయ సమ్మేళన సంబరాలు పేరిట నిర్వహించిన కార్యక్రమానికి వారు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఏటా డిసెంబర్ 17న పెన్షనర్స్ డే నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారుల సాంస్కృతిక నృత్యాలు ఆహుతులను అలరింపజేశాయి. ప్రధాన కార్యదర్శి కిష్టయ్య, అసోసియేటెడ్ అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

వలస.. ఏదీ భరోసా?



గల్ఫ్ వెళ్తున్న వారికి వీడ్కోలు పలుకుతున్న కుటుంబసభ్యులు (ఫైల్)



ఉన్న ఊరిలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతుండడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులు వలసబాట పడుతున్నారు. ఉపాధి అవకాశంతో పాటు అధిక వేతనాలు, మరింత మెరుగైన జీవనం కోసం వేరే ప్రాంతాలకు వెళ్లడం.. పల్లెల నుండి పట్టణాలకు, ఒక రాష్ట్రం నుండి మరో రాష్ట్రానికి వెళ్లడాన్ని అంతర్గత వలసలు అంటారు. ఒకదేశం నుండి మరో దేశానికి వెళ్లడాన్ని అంతర్జాతీయ వలసలు అంటారు. నేడు అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం నేపథ్యంలో 'సాక్షి' ప్రత్యేక కథనం...



“ నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రానికి చెందిన గాండ్ల రమణ ఉపాధి నిమిత్తం దాదాపు 12 ఏళ్లక్రితం ఒమన్ దేశానికి వెళ్లి కొన్ని నెలలక్రితం స్వగ్రామానికి వచ్చాడు. ఇక్కడ స్వయం ఉపాధి పొందేందుకు బీసీ వర్గానికి చెందిన వ్యక్తిగా తనకు ఏదైనా రుణం మంజూరు చేయించాలని కొన్నిరోజులక్రితం కలెక్టరేట్, డీఆర్డీవో, తదితర కార్యాలయాల్లో విన్నవించుకున్నాడు. రుణం మంజూరు కోసం కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చినా ఇప్పటికీ ఎలాంటి సాయం అందలేదని గాండ్ల రమణ పేర్కొంటున్నాడు. గల్ఫ్ నుండి వాపస్ వచ్చిన ఇలాంటి వారు ఎందరో ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల కోసం అన్వేషిస్తున్నారు.

- ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు..
- తిరిగొచ్చాక భరోసా కరువు..
- ఉమ్మడి జిల్లాలో లక్షలాది మంది వలస కార్మికులు
- నేడు అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం

నిర్మల్‌ఖిల్లా: ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వలసదారులు ఉజ్వల భవిష్యత్, తగిన గుర్తింపు కోసం తమ మాతృభూమిని వదిలి వేరొక దేశానికి వెళ్తుంటారు. ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 80 వేలకు పైగా కార్మికులు వివిధ దేశాలకు ఉపాధి నిమిత్తం వెళ్లినట్లు గల్ఫ్ సంక్షేమ సంఘాలు పేర్కొంటున్నాయి. వీరే కాకుండా గల్ఫ్ దేశాల నుంచి తిరిగొచ్చిన జిల్లా వాసులు దాదాపు 2 లక్షల వరకు ఉంటారని ప్రవాసీమిత్ర కార్మిక సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. జిల్లా నుంచి గల్ఫ్‌కు వెళ్తున్న వ్యక్తులకు సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడంతో ఎక్కువ మంది కూలీలు గానే పనులు చేస్తున్నారు. తిరిగొచ్చిన తర్వాత కూడా సరైన ప్రత్యామ్నాయ, ఉపాధి మార్గాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇదీ నేపథ్యం..

వలస వెళ్తున్న పౌరులకోసం ఐక్యరాజ్య సమితి డిసెంబర్ 18ని అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం (ఇంటర్నేషనల్ మైగ్రంట్స్ డే)గా ప్రకటించింది. ఈ మేరకు ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధుల సభ (యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ) 31 ఏళ్ల క్రితం 18 డిసెంబర్ 1990 సంవత్సరంలో జరిగిన సమావేశంలో 'వలస కార్మికులు, కుటుంబ సభ్యుల హక్కుల రక్షణ' గురించి ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఎంత స్వేచ్ఛా స్వతంత్రంగా విదేశాలకు వెళ్తున్నారో అంతే స్వేచ్ఛగా తిరిగిరావొచ్చని సభ తీర్మానం చేసింది.

ప్రధాన డిమాండ్లు

- తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర ఎన్నారై పాలసీ (ప్రవాసీ విధానం) ప్రవేశపెట్టాలని, గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనే డిమాండ్ చాలాకాలంగా అమలుకు నోచుకోవడంలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్లలో 6 వేలకు పైగా తెలంగాణ ప్రవాసీయులు గల్ఫ్ దేశాలలో వివిధ కారణాలతో మృతి చెందగా రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా కోసం కుటుంబాలు ఎదురుచూస్తున్నాయని, రూ.500 కోట్ల వార్షిక బడ్జెట్‌తో గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి, పునరావాసానికి కృషి చేయాలని ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్, గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.
- విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వారు ముంబయిలో ఏర్పాటు చేసిన మాదిరి హైదరాబాద్‌లో 'విదేశ్‌భవన్' ఏర్పాటు చేయాలని, ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌లో పాస్‌పోర్టు ఆఫీసు, ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రంట్స్ ఆఫీసు, ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్(ఐసీసీఆర్) రీజినల్ ఆఫీసు, విదేశాంగ శాఖ బ్రాంచి సెక్రెటేరియట్లు ఉండాలని, 'ప్రవాసీ తెలంగాణ దివస్' అధికారికంగా నిర్వహించాలని కోరుతున్నారు.

వలసదారుల సంక్షేమానికి కృషి చేయాలి



వలస కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి. కేరళ తరహా ప్రత్యేక గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయాలి. వార్షిక బడ్జెట్‌లో రూ.500 కోట్ల నిధులు కేటాయించాలి. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. గల్ఫ్‌లో రాష్ట్ర ప్రభుత్వం మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలి. తిరిగి వచ్చిన కార్మికులకు ఉపాధికోసం ఆయా వ్యక్తుల నైపుణ్యాలను బట్టి ప్రభుత్వాలు తగిన చేయూతనివ్వాలి.

– దొనికెన కృష్ణ, గల్ఫ్ జేఏసీ రాష్ట్ర నాయకుడు

రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనివి..

- అమాయకులైన వలస కార్మికుల రక్షణకు ఆరు అరబ్ గల్ఫ్ దేశాలతో సహా 18 దేశాలను ఈసీఆర్ దేశాలుగా వర్గీకరించిన 1983 లోని ఎమిగ్రేషన్ చట్టం యొక్క ప్రాతిపదిక ప్రకారం గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయాలి. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి రూ.500 కోట్ల వార్షిక బడ్జెట్ కేటాయించాలి. గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.
- జీవిత బీమా, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, పెన్షన్‌లతో కూడిన సమగ్రమైన సాంఘిక భద్రత (సోషల్ సెక్యూరిటీ) పథకం ప్రవేశ పెట్టాలి.
- గల్ఫ్‌కు వెళ్లిన సన్నకారు, చిన్నకారు రైతులకు రైతుబంధు, రైతు బీమా పథకం వర్తింపజేయాలి.

కేంద్ర ప్రభుత్వం పరిధిలోనివి..

- హైదరాబాద్‌లో సౌదీ, యూఏఈ, కువైట్ దేశాల కాన్సులేట్‌లు (రాయబార కార్యాలయాలు) ఏర్పాటయ్యేలా కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలి.
- ప్రవాస భారతీయ బీమా యోజన అనే రూ.10 లక్షల విలువైన ప్రమాద బీమా పథకంలో సహజ మరణం కూడా చేర్చాలి. రూ.325 చెల్లిస్తే రెండు సంవత్సరాల కాలపరిమితితో ఇన్సూరెన్స్ ఇస్తారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.
- ఎమిగ్రేషన్ యాక్టు–1983 ప్రకారం గల్ఫ్ దేశాలకు ఉద్యోగానికి వెళ్ళడానికి సర్వీస్ చార్జీగా అభ్యర్థి 45 రోజుల వేతనం (రూ.30 వేలకు మించకుండా) మాత్రమే ఏజెంటుకు చెల్లించాలి. దీనిపై 18 శాతం జీఎస్టీ రూ.5,400 చెల్లించాల్సి ఉంటుంది. జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలి.

దున్నపోతు చంపేసింది

- రెండు రోజుల క్రితమే మరో కాపరిపై రెండుసార్లు దాడికి యత్నం
- తాజాగా పశువులను తోలుకొస్తుండగా కాపరిని పొడిచి చంపిన వైనం
- ఖానాపూర్ మండలంలో ఘటన



దున్నపోతు నుంచి తప్పించుకునేందుకు చెట్టెక్కిన ముత్యం



గంగన్న(ఫైల్)

ఖానాపూర్: పశువుల కాపరిపైనే దున్నపోతు దాడి చేసి చంపిన ఘటన నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం రాజూరాలో ఆదివారం సాయంత్రం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పశువుల కాపరి చామన్‌పల్లి గంగన్న (60) రోజువారీలాగానే గేదెలను ఉదయం మేతకు తీసుకెళ్లాడు. వారివెంట గ్రామానికి చెందిన విత్తనపు దున్నపోతు కూడా వెళ్లింది. సాయంత్రం గేదెలను ఇంటికి తోలుకొస్తుండగా దున్నపోతు ఒక్కసారిగా కాపరిపై తిరగబడింది. విచక్షణ రహితంగా కుమ్మడంతో గంగన్న తీవ్రంగా గాయపడ్డాడు. పక్కనే ఉన్న మరో కాపరి గమనించి వెంటనే గ్రామస్తులకు ఫోన్‌చేసి చెప్పాడు. వెంటనే వారు ఘటన స్థలానికి చేరుకుని దున్నపోతును తరిమారు. గాయపడిన గంగన్నను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. గంగన్నకు భార్య ఆశవ్వ, ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పగబట్టిందంటున్న గ్రామస్తులు

ఇదిలా ఉండగా.. గ్రామానికి చెందిన విత్తనపు దున్న పగపట్టి దాడిచేసిందని గ్రామస్తులు ప్రచారం చేస్తున్నారు. మూడు రోజుల క్రితం గ్రామానికి చెందిన ముత్యంపై దాడికి యత్నించడంతో ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శుక్రవారం చనిపోగా అతని అంత్యక్రియల్లో ముత్యం పాల్గొన్నాడు. ఈ క్రమంలో అక్కడే మేతకు వెళ్లిన దున్న పరిగెత్తుకుంటూ వచ్చి దాడికి యత్నించింది. దీంతో అతను చెట్టెక్కి ప్రాణాలు కాపాడుకున్నాడు. ఈ దృశ్యాన్ని స్థానికులు వీడియో తీశారు. దున్నపోతును గ్రామం నుంచి తరలించాలని సర్పంచ్‌ను కోరారు. ఇంతలోనే ఆదివారం అదే దున్న పశువుల కాపరిని పొడిచి చంపడంతో రాజూరాలో విషాదం నెలకొంది. దున్నపోతు మనుషులను పగబట్టిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఆలస్యం.. ఆయువు తీసింది

- ఉపాధ్యాయుల నిర్లక్ష్యం.. నిర్వాహకుల అశ్రద్ధ..
- వేడి రాగిజావ పాత్రలో పడిన చిన్నారి
- చికిత్స పొందుతూ మృతి
- కొరిటికల్‌లో విషాదం
- ఇన్‌చార్జి హెచ్‌ఎం, మధ్యాహ్న భోజన ఏజెన్సీపై వేటు
- ముగ్గురు టీచర్లకు షోకాజ్ నోటీసులు



రోదిస్తున్న కుటుంబ సభ్యులు



కొండ్ర ప్రజ్ఞ(ఫైల్)

మామడ: విద్యార్థులకు రాగి జావా పంపిణీలో నిర్వాహకుల అశ్రద్ధ, ఉపాధ్యాయుల నిర్లక్ష్యం.. ఓ చిన్నారి ఆ యువు తీసింది. పాఠశాలలో ఉదయం అల్పాహారంగా రాగిజావా ఇవ్వాల్సి ఉండగా, మధ్యాహ్నం వరకు నిర్వాహకుల పంపిణీ చేయలే దు. పేరెంట్స్, టీచర్ మీటింగ్‌లో పడి ఆ విషయాన్ని ఉపాధ్యాయులూ నిర్లక్ష్యం చేశారు. మీటింగ్ తర్వాత రాగిజావ పంపిణీకి తయారు చేశారు. పంపిణీ కోసం ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో వేడి గిన్నెను పాఠశాల ఆవరణలో ఉంచారు. ఈ క్రమంలో అటుగా వచ్చిన ఒకటో తరగతి విద్యార్థిని ప్రజ్ఞ(6) అందులో పడింది. చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ విషాద ఘటన నిర్మల్ జిల్లా మామడ మండలం కొరిటికల్ గ్రామంలో జరిగింది.

వివరాలు ఇలా ఉన్నాయి..

గ్రామానికి చెందిన కొండ్ర అశోక్, శిరీష దంపతుల కుమార్తె ప్రజ్ఞ (6) స్థానికంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి చదువుతుంది. చిన్నారి చదువులోనూ, స్నేహితులతో ఆడుతూ హుషారుగా ఉంటుంది. పాఠశాలలో శనివారం జరిగిన పోషకుల సమావేశానికి చిన్నారి తల్లి ఉపసర్పంచ్ శిరీష హాజరై మాట్లాడారు. విద్యార్థులు పాఠశాలకు పూర్తిస్థాయిలో హాజరయ్యేలా తల్లిదండ్రులు చూడాలని కోరారు. చదువులో ప్రజ్ఞ ప్రతిభ కనబరుస్తుందని ఉపాధ్యాయులు శిరీషకు వివరించారు. ప్రజ్ఞకు జ్వరం కారణంగా వారం రోజులుగా పాఠశాలకు రాలేదని శనివారం వచ్చిందని ఇంటికి పంపించాలని తల్లి కోరింది. తరగతుల అనంతరం పంపిస్తామని చెప్పాడంతో ఆమె ఇంటికి వెళ్లింది.

ప్రమాదవశాత్తు పడి..

ఉదయం 11.30 గంటల తర్వాత పోషకుల సమావేశం ముగిసింది. ఈ క్రమంలో వేడి రాగిజావాను పెద్దపాత్ర నుంచి బకెట్‌లో వేరు చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంతలో విద్యార్థులు వచ్చారు. ప్రజ్ఞ వరుసలో ఉండి వెనుకకు తిరిగి స్నేహితులతో మాట్లాడుతుండగా ప్రమాదవశాత్తు వేడిరాగిజావా పాత్రలో పడింది. కేకలు వేయడంతో ఉన్నత పాఠశాల విద్యార్థి ఆమెను బయటకు తీశాడు. ఉపాధ్యాయులు, కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతిచెందింది. కాగా, ప్రజ్ఞ మృతితో కుటుంబంలో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. శనివారం పాఠశాల నుంచి కూతురిని ఇంటికి తీసుకువచ్చిన బతికేదని తల్లిదండ్రులు కన్నీరుపెట్టడం కలిచివేసింది.

పాఠశాలలో విచారణ



విచారణ చేస్తున్న తహసీల్దార్ సర్వరాజ్

పాఠశాలలో తహసీల్దార్ సర్వరాజ్ ఆదివారం విచారణ చేపట్టారు. కుటుంబ సభ్యులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులను అడిగి వివరాలు తెలుసుకుని ఉన్నతాధికారులకు నివేదించారు. కలెక్టర్ ఆదేశాలతో డీఈవో రవీందర్‌రెడ్డి చర్యలు చేపట్టారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం రమను సస్పెన్షన్ చేయడంతోపాటు ముగ్గురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అదే విధంగా నిర్లక్ష్యంగా వ్యవహరించిన మధ్యాహ్న భోజన ఏజెన్సీని తొలగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఎంఈవోని ఆదేశించారు.

ట్రాక్టర్ బోల్తా.. బాలుడు మృతి



యోగేశ్ మృతదేహం

భైంసా: ట్రాక్టర్ బోల్తా పండి బాలుడి మృతిచెందిన ఘటన మండలంలోని దేగాం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి బొగ్గుల యోగేశ్(16) స్థానికంగా ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో తండ్రి పోతన్నతో కలిసి ట్రాక్టర్‌పై పొలానికి వెళ్లాడు. పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా ట్రాక్టర్ నడుపుతున్న పోతన్న ముళ్లకంపను తప్పించబోగా, ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడింది. ఈ ఘటనలో యోగేశ్‌పై ట్రాక్టర్ పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్సై శ్రీకాంత్ ఘటనాస్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని భైంసాలోని ఏరియాస్పత్రికి తరలించారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కేవైసీ కోసం వచ్చి ఒకరు మృతి

ఎదులాపురం: గ్యాస్ కేవైసీ కోసం వచ్చి ఒకరు మృతిచెందిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ ఎస్సై జి.నారాయణస్వామి కథనం ప్రకారం..సిరికొండ మండలానికి చెందిన అంగ పొచన్న (40) తన కుమారుడు చరణ్‌తో కలిసి శనివారం ఆదిలాబాద్‌లోని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వద్దకు వచ్చారు. జనం రద్దీ ఉండడంతో ఎలాగోలా వస్తానని చెప్పి కుమారుడిని వెళ్లిపోమన్నాడు. శనివారం రాత్రి అయినా పొచన్న రాలేదు. ఆయన తండ్రి స్వామి, బావ రమేశ్ ఆదివారం గ్యాస్ ఏజెన్సీ సమీప ప్రాంతాల్లో గాలించారు. ఏజెన్సీ ఎదురుగా ఉన్న రెండు లారీల మధ్యలో పొచన్న పడుకుని ఉన్నాడు. లేపేందుకు ప్రయత్నించగా ఎలాంటి చలనం లేకపోవడంతో మృతిచెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. మద్యం తాగి, రాత్రి తినకుండా ఆరుబయట పడుకోవడంతో చలికి బిగుసుకుపోయి మృతిచెందినట్లు వైద్యులు నివేదిక ఇచ్చారు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో ఎస్సై

లోకేశ్వరం: మండల కేంద్రానికి చెందిన షేక్ సమీర్‌లో ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. పక్కా సమాచారంతోనే షేక్ సమీర్ ఇంట్లో తనిఖీ చేసి నిల్వ ఉన్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామన్నారు. సమీర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాసరలో మంత్రి కొండా సురేఖ పూజలు



మంత్రి కొండా సురేఖకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈవో, అర్చకులు

భైంసా: రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారిని ఆదివారం దర్శించుకున్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా దేవస్థానానికి వచ్చారు. ఆలయ ప్రధానార్చకులు ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మంత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో విజయరామారావు, అర్చకులు, పండితులు అమ్మవారి చిత్రపటం అందజేసి శాలువాతో సన్మానించారు. అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.